క్లుప్తంగా

కాకాణితో నేదురుమల్లి భేటీ



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సోమవారం ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

చట్టాలపై అవగాహన



చీరల పంపిణీ

నెల్లూరు(బృందావనం): మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని విశ్రాంత ఏఎస్పీ, కళాకారుడు అంకిరెడ్డి తెలిపారు. కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో నర్తకి సెంటర్‌లో సోమవారం 'మహిళలపై దాడులను ఖండించండి' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మహిళలకు దుప్పట్లు, చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు.

పలువురికి సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని 53, 54 డివిజన్లలోని మసీదుల్లో విధులు నిర్వహిస్తున్న ఇమామ్, మౌజన్లను సోమవారం సన్మానించారు. నగరంలోని 54వ డివిజన్ అలీనగర్‌లో ఉన్న హర్షకలీ మసీదులో వికలాంగుల ఐక్యసంఘ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. కార్యక్రమంలో సనావుల్లా, జమీర్ అహ్మద్, ప్రసాద్, మంజు, అబ్దుల్ ఖాదర్, రజాక్, రఫీ, హఫీజ్, నూరుల్లా పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా..



నెల్లూరు(బృందావనం): టీటీఎస్ కల్యాణసదన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సుజాతమ్మకాలనీలోని శ్రీకృష్ణమందిరంలో ప్రతిభగల 79 మంది బ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహకంగా రూ.6.18 లక్షల నగదు అందజేశారు. డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్, బీడీఎస్, ఎంబీబీఎస్‌లో ప్రతిభ చూపిన వారికి నగదు అందజేశారు. కల్యాణసదన్ మేనేజింగ్ ట్రస్టీ డి.ఫణిరత్నం, అధ్యక్షుడు డాక్టర్ సర్వేపల్లి పరాశర్, డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(అర్బన్): నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లోని 50 మంది రోగులకు అబైడింగ్ హోప్ ట్రస్ట్, పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ట్రస్ట్ డైరెక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా తాము రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి, రేడియేషన్ అంకాలజిస్ట్ డా.గీతాఉషశ్రీ, జీఎం భక్తవత్సలరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ పాల్గొన్నారు.

40,285 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు రూరల్: కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 40,285.32 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. సోమవారం 3,336.72 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.86.6 కోట్లు రైతులకు చెల్లించినట్లు తెలిపారు.

లార్వా సర్వే

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి ఆవరణలోని నర్సింగ్ క్వార్టర్స్‌లో చికున్ గున్యా కేసు నమోదైంది. దీంతో జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది అక్కడ లార్వా సర్వే, పీడీపీ వర్క్, ఫీవర్ సర్వే సోమవారం నిర్వహించారు. ఈ సర్వేను మలేరియా సహాయ అధికారి నాగార్జునరావు పరిశీలించారు.

కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు

సాక్షి, న్యూఢిల్లీ: నెల్లూరు సిటీ కాంగ్రెస్ కమిటీని అధిష్టానం ఏర్పాటు చేసింది. ఈ ప్రతిపాదనకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదముద్ర వేశారు. సిటీ కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడిగా నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

కనికరించండి సారూ..

- కార్పొరేషన్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- ప్రజల నుంచి 58 వినతులు
- హౌసింగ్, టౌన్ ప్లానింగ్‌పై అత్యధికంగా..



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): 'మా వినతుల్ని పరిశీలించి న్యాయం చేయండి సారూ..' అంటూ జనం అధికారులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఎన్‌ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో జరిగింది. అదనపు కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఏడు, హౌసింగ్‌వి 22, టౌన్ ప్లానింగ్‌వి 17, రెవెన్యూవి 6, పబ్లిక్ హెల్త్‌వి 2, ఆఫ్కాస్‌వి 1, హెచ్ సెక్షన్‌వి 1 తదితర వినతులు మొత్తం 58 అధికారులకు అందాయి. ఈ సందర్భంగా నందన్ మాట్లాడుతూ టిడ్కో గృహాల లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ తక్కువగా ఉండటం, వయసు ఎక్కువగా ఉండటం వంటి వివిధ కారణాలతో బ్యాంకుల నుంచి రుణాలు అందలేదని, వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించనున్నామని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల గురించి, మార్ట్‌గేజ్ విడుదల గురించి అర్జీలు అందుకున్నామని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై స్పందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, డీసీపీ పద్మజ, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ పూర్వ వైభవానికి కృషి

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆలయంలో మంత్రి ఆనం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. దేవస్థానంలో సోమవారం జరిగిన పాలకమండలి సమావేశానికి ఆయన హాజరయ్యారు. తొలుత స్వామిని దర్శించుకున్నారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పీఠాధిపతుల సలహాలు, పాలకమండలి సభ్యులు, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

ఆర్టీఓ కార్యాలయాల్లోనే ఎఫ్‌సీలివ్వాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఆటో కార్మిక సంఘం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని ఆర్టీఓ కార్యాలయాల్లోనే సెన్సార్ పద్ధతిలో వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వాలని, ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, ఆటో యూనియన్ నగర కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి పూలమార్కెట్ వరకు సోమవారం ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు ఆటో కార్మికులకు విధిస్తున్న అధిక జరిమానాలను రద్దు చేయాలన్నారు. ఎఫ్‌సీలు మంజూరు చేసే విధానాన్ని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వొద్దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో రవాణా రంగాన్ని తీవ్ర సంక్షోభంలో నెడుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రాజా, నివాస్, రవీంద్ర, శ్రీనివాసులు, విజయ్, రమణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్మరణోత్సవాలు



షణ్ముఖప్రియ, హరిప్రియల గాత్ర కచేరి

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలో శ్రీత్యాగరాజ స్మరణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి చెన్నైకి చెందిన షణ్ముఖప్రియ, హరిప్రియ (ప్రియా సోదరీమణులు) గాత్ర కచేరి వీనుల విందుగా సాగింది. ఉదయం నంది వసంతకుమారి భాగవతారిణిచే మహారధికర్ణ హరికథ, నాయని లక్ష్మీకుమారి భాగవతారిణిచే తులసీజలంధర హరికథా గానం, సాయంత్రం పలు కార్యక్రమాలు జరిగాయి. కమిటీ శాశ్వత కార్యదర్శి ఎనమండ్ర నాగదేవిప్రసాద్, సభ్యులు పర్యవేక్షించారు.

32వ డివిజన్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రంజాన్ సందర్భంగా 32వ డివిజన్‌లో డైకస్ రోడ్ సెంటర్‌లో ఉన్న జకారియా మసీదులో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దీనికి వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో 29వ కార్పొరేటర్ సత్తార్, నాయకులు అబ్దుల్ సలీం, శ్రీనివాస్‌రావు, ఆదిరెడ్డి, అబ్దుల్ రజాక్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రంగడి' హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపును సోమవారం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు రూ.2,32,094 సమర్పించారని కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

కార్మికులకు న్యాయం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు(పొగతోట): పొదలకూరు, కోవూరు షుగర్ ఫ్యాక్టరీల్లో పనిచేసిన కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించి న్యాయం చేయాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ కోరారు. సోమవారం కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. రమేష్ మాట్లాడుతూ ఆ ఫ్యాక్టరీల్లో సుమారు 2 వేల మంది కార్మికులు పనిచేశారన్నారు. బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

త్వరలో డ్రెయినేజీ పనుల పూర్తి

- మంత్రి నారాయణ



నగరంలో పర్యటిస్తున్న మంత్రి

నెల్లూరు సిటీ: నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థకు సంబంధించిన పనులను త్వరలో పూర్తి చేస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.165 కోట్ల హడ్కో నిధులతో మిగిలిపోయిన 10 శాతం పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో రూ.5 వేలు ఉన్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం ఫీజును సీఎంతో మాట్లాడి కేవలం ఒక్క రూపాయి తీసుకునేలా ఒప్పించడం జరిగిందన్నారు. పాఠశాలల్లోని ఆట స్థలాలను పరిశీలించి, అనువైన చోట బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

మా సత్తా చూపుతాం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి మాలల సత్తా ఏమిటో చూపించాలని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర పిలుపునిచ్చారు. నగరంలోని విజయకుమార్ ఆస్పత్రిలో సోమవారం మాల ఉద్యోగ సంఘం, మాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అశాస్త్రీయమైందన్నారు. మాలలందరూ సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పందిపాటి ఆదినారాయణ, హరి, కృష్ణప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్, బాలకృష్ణ, మదన్‌మిశ్రా, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి రాయించుకుని.. తండ్రిని గెంటేసి..

నెల్లూరు సిటీ: తండ్రి ఆస్తి తనపేరుపై రాయించుకుని ఇంటి నుంచి గెంటేసిన కుమారుడిపై సంతపేట పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. చిన్న బజారు ఫణతులవారివీధిలో జి.పెద్ద వెంకట సుబ్బయ్య కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. భార్య 2018లో మరణించింది. అప్పటి నుంచి వెంకటసుబ్బయ్యకు ఆరోగ్యం బాగో లేదు. పెద్ద కుమారుడైన వెంకటసుబ్బయ్య తండ్రి బాగోగులు చూసుకుంటానని చెప్పాడు. ఆయన వద్ద ఉన్న రూ.19 లక్షల నగదు, తల్లికి చెందిన 450 గ్రాముల బంగారం, నెల్లూరులోని ఇంట్లో వాటాను తనకు చెందేలా వీలునామా రాయించుకుని రిజిస్టర్ చేయించుకున్నాడు. అనంతరం తండ్రిని తాను ఉంటున్న అన్నమయ్య జిల్లాకు తీసుకెళ్లాడు. రెండేళ్ల వరకు చూసుకుని ఇంటి నుంచి గెంటేశాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని శ్రీజీవన యోగశాల ఆరోగ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన ప్రదానం చేయనున్న ఉగాది ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ ట్రస్ట్ చైర్మన్ ఎంవీ ప్రసన్నకుమార్ తెలిపారు. గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో సోమవారం పురస్కారాల లోగో, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజసేవ, విద్య, వైద్యం, సాహిత్యం, పాండిత్యం, శాస్త్రీయ సంగీతం, నృత్యం, యోగా, క్రీడలు తదితర రంగాల్లో పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 93914 91052, 88856 68752 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో పురస్కారాలు ఇస్తామన్నారు. ముత్యాల రవీంద్ర, పద్మావతి, బెల్లంకొండ నాగరాజు పాల్గొన్నారు.

వార్డు సభలకు ఏర్పాట్లు

నెల్లూరు(బారకాసు): పీ4 సర్వే వార్డు సభల నిర్వహణకై పటిష్ట ఏర్పాట్లు చేయాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ తెలియజేశారు. ప్రతి రెండు డివిజన్లకు ఒక నోడల్ అధికారిని నియమిస్తూ సోమవారం కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 30వ తేదీ నుంచి సర్వే ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. వార్డు సచివాలయ కార్యదర్శులు ప్రతి ఇంటికీ తిరిగి సమాచారాన్ని సేకరించాలని, ఓటీపీ ద్వారా వారి ఆధార్‌ను నిర్ధారించుకోవాలని తెలియజేశారు. సర్వే ద్వారా ఆర్థిక స్థితి, గృహంలోని మౌలిక సదుపాయాలు తదితర వివరాలను సేకరించి ఆన్‌లైన్ చేయించాలని సూచించారు.

మంత్రులకు వినతి

నెల్లూరు(పొగతోట): మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) పోస్టులను నేరుగా నియమించే ప్రక్రియను రద్దు చేసి పదోన్నతులతో నియామకాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ పరిపాలన అధికారుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఎంప్లాయీస్ సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ నాలుగో తరగతి సిబ్బంది సంఘం నేతలు కోరారు. సోమవారం మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణకు వినతిపత్రాలు సమర్పించారు. విస్తరణాధికారి హోదాను డిప్యూటీ ఎంపీడీఓగా మార్పుగా నిర్ణయం తీసుకున్నారన్నారు. పరిపాలనాధికారి హోదాను కూడా డిప్యూటీ ఎంపీడీఓ పేరు మార్పు చేయాల్సిందిగా కోరారు.

ఎమ్మెల్యే తనిఖీలు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 20వ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొందాం

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- మనుబోలు మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం



నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు సిటీ: 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయాయి. వాటిని ధైర్యం ఎదుర్కొందాం' అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం మనుబోలు మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడకుండా, ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నిద్దామన్నారు. రాష్ట్రంలో రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, తెలుగుదేశం శ్రేణులు మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. అన్యాయానికి పూనుకుంటున్న వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కూటమి నేతలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి, కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గిట్టుబాటు ధర లేక రైతులు విలవిల్లాడుతుంటే, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రైతులను ఆదుకోకపోతే వైఎస్సార్‌సీపీ పక్షాన పోరాటం చేస్తామన్నారు. కేసులకు, అరెస్టులకు, జైలుకు భయపడకుండా ధైర్యంగా ముందడుగు వేద్దామని చెప్పారు. పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అండగా నిలుస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీని జిల్లాలో తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామన్నారు.

కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి



నూతన కార్యవర్గానికి సన్మానం

నెల్లూరు(టౌన్): స్థానిక కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో సోమవారం విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ సమావేశం జరిగింది. ఇందులో వర్సిటీ ప్రైవేట్ పీజీ, డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణచైతన్య కళాశాల చైర్మన్ ఆర్‌వీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మనోహర్‌రెడ్డి (వేమారెడ్డి డిగ్రీ కళాశాల, నాయుడుపేట) నియమితులయ్యారు. ఫైనాన్స్ సెక్రటరీగా నారాయణరెడ్డి (విజ్ఞాన్ డిగ్రీ కళాశాల, పొదలకూరు), ఉపాధ్యక్షులుగా రాజకుమార్ చౌదరి (ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాల, కావలి), నిరంజన్‌రెడ్డి (శ్రీనివాస డిగ్రీ కళాశాల, గూడూరు), కేవీన్ రాజు (షిర్డీ సాయిరాం డిగ్రీ కళాశాల, ఆత్మకూరు), జనరల్ సెక్రటరీలుగా విజయబాబు (ప్రగతి డిగ్రీ కళాశాల, సూళ్లూరుపేట), రాంగోపాల్ (నేతాజీ డిగ్రీ కళాశాల, వింజమూరు), దినేష్ వర్ధన్ (వివేకానంద డిగ్రీ కళాశాల, నెల్లూరు), పాలకవర్గ సభ్యులుగా వెంకటేశ్వర్లు, వెంగళరెడ్డి, జానకిరాం, శివసాకేత్, సుబ్బారెడ్డి, మహిళా ప్రతినిధిగా ఎం.బిందులు నియమితులయ్యారు. దీని పరిశీలకులుగా రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు విజయబాస్కరరెడ్డి, అధ్యక్షుడు గుండారెడ్డిలు వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలంటూ..



డీఈటీకి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని యూనియన్ ఏపీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యదర్శి బొజ్జా సుమన్ డిమాండ్ చేశారు. నగరంలోని విద్యుత్ భవన్‌లోని డీఈటీ శేషాద్రి బాలచంద్రకు యూనియన్ నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ ఏప్రిల్ నెల 7వ తేదీన తిరుపతిలోని సీఎండీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. 2019 సంవత్సరం తర్వాత షిఫ్టు ఆపరేటర్లుగా నియమితులైన వారికి పాత వారికి సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి పెంచలప్రసాద్, జిల్లా అధ్యక్షుడు గోగుల మహేష్, నగర అధ్యక్షుడు హరినారాయణ, జిల్లా నాయకులు మజార్, లక్ష్మీపతి, జేఎల్ఎం గ్రేడ్ – 2 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రసూల్, ప్రసన్నకుమార్‌రెడ్డి, సునీల్, బాలభాస్కర్, వెంకటేశ్వర్లు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

నెల్లూరు(అర్బన్): క్షయ రహిత సమాజం కోసం కృషి చేద్దామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలో గుప్తాపార్కు, బీఈడీ కళాశాల తదితర ప్రాంతాల్లో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యశాఖ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో సదస్సు జరిగింది. 25 పంచాయతీలకు టీబీ రహిత పంచాయతీలుగా సర్టిఫికెట్లు, మహాత్మా గాంధీ జ్ఞాపికలు అందించారు. అలాగే టీబీ నిర్మూలనా కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపిన పలు ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని డాక్టర్లకు, హెల్త్ సిబ్బందికి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా టీబీ, లెప్రసీ నిర్మూలన అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ, మెడికల్ ఆఫీసర్లు డా.సురేంద్రబాబు, డా.రమేష్, డా.భవాని, రామకృష్ణ, డెమో అధికారి కనకరత్నం పాల్గొన్నారు.

➡ టీబీని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రావూస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ వి.గుణశేఖర్ అన్నారు. ప్రపంచ టీబీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ఆ కళాశాలకు చెందిన విద్యార్థులు సోమవారం బుజబుజనెల్లూరు, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు నాగేశ్వరరావు, శేఖర్, ప్రసన్న, శిరీష, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

➡ నెల్లూరు రూరల్: నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో సోమవారం టీబీ నిర్మూలన దినోత్సవాన్ని సునీత నర్సింగ్ కళాశాలలో నిర్వహించారు. దీనికి నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి, జయప్రకాష్, రసూల్ కళాశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక



పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యవర్గ సభ్యులు

నెల్లూరు సిటీ: ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని డీపీఈఓ ఎ.శ్రీనివాసులు నాయుడు సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈనెల 23వ తేదీన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా మారెళ్ల కృష్ణయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా మైనపూరు కిరణ్ సింగ్, ఉపాధ్యక్షులుగా తిరుమలశెట్టి సుబ్రమణ్యం, గుంజి వెంకటరమణయ్య, ప్రధాన కార్యదర్శిగా బక్కముంతల దయాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా షేక్ జలీల్‌బాషా, జాయింట్ సెక్రటరీలుగా ఎర్రగుంట మాల్యాద్రి, మటింపాటి అంకయ్య, ప్రెస్ సెక్రటరీలుగా మొగిరాల పెంచలయ్య, తలారి శ్రీనివాసులు, కోశాధికారిగా ఆకుల శ్రీరాములు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ముమిడి రవి, చెరుకుమూడి శ్రీహరి, పెనుమూరు సుబ్బయ్య, బెల్లంకొండ పుట్టయ్య నియమితులయ్యారు. నూతన కార్యవర్గం జిల్లా డీపీఈఓ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు – 1 ఇన్‌స్పెక్టర్ పి.రమేష్‌బాబు, ఎస్సైలు ప్రభాకర్‌రావు, శ్రీధర్ మురళీకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసింది.

సమస్యల పరిష్కారానికి ధర్నా నేడు



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం నెల్లూరు నగర, రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్ పిలుపునిచ్చారు. బాలాజీనగర్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా చైతన్య యాత్రలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. కలుషిత నీరు, దోమల బెడద, పారిశుద్ధ్యం, ఇంటి, కుళాయి పన్నుల పెంపు, వాటిని చెల్లించాని అధికారుల ఒత్తిడి చేయడం తదితరాలను ప్రజలు చెప్పారన్నారు. కార్పొరేషన్ అధికారుల తీరును నిరసిస్తూ, ప్రజలకు మౌలిక వసతులను మెరుగుపరచాలని, పన్నులు తగ్గించాలని బారాషహీద్ దర్గా మైదానం నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేస్తామన్నారు. సమావేశంలో నేతలు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, పెంచలనరసయ్య, అజీజ్, సూర్యానారాయణ, శ్రీనివాసులు, నరసింహ, మద్దిపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.